# భద్రాద్రిలో రేపు డోలోత్సవం, వసంతోత్సవం

## వేడుకల నిర్వహణకు నేడు అంకురారోపణం



సీఎస్ శాంతికుమారికి శ్రీరామ నవమి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ ఈవో

భద్రాచలం, మార్చి 23 : హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయంలో సోమవారం డోలోత్సవం, వసంతోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ క్రమంలో వేడుకల నిర్వహణకు ఆలయంలో ఆదివారం అంకురారోపణం చేయనున్నారు. ఏప్రిల్ 17వ తేదీన శ్రీరామ నవమి, 18న రామయ్యకు పట్టాభిషేకం వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు శ్రీరామ నవమి ఆహ్వాన పత్రికల పంపిణీ కార్యక్రమానికి ఆలయ ఈవో, అర్చకులు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌లో సీఎస్ శాంతికుమారి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను కలిసి ఆలయ ఈవో ఎల్.రమాదేవి అర్చకులతో కలిసి పత్రికలు అందజేశారు.

### ఆలయంలో రేపటి కార్యక్రమాలు

హోలీ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి సోమవారం సహస్రధారలతో కనుల పండువగా అభిషేకం నిర్వహిస్తారు. తర్వాత స్వామివారిని వెండి ఊయలలో వేంచేపు చేసి డోలోత్సవం చేపడతారు. ఆస్థాన హరిదాసులు భక్త రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలు ఆలపిస్తుండగా.. నక్షత్ర, కుంభ తదితర హారతులను స్వామివారికి సమర్పిస్తారు. హోలీ పండుగను పురస్కరించుకొని స్వామివారికి వసంతోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం తాతగుడి సెంటర్ వరకు స్వామివారి తిరువీధి సేవ నిర్వహిస్తారు. అలాగే హోలీ పండుగ రోజు రామయ్య పెళ్లి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. మిథిలా స్టేడియం ఎదురుగా ఉన్న ఉత్తర ద్వార దర్శనం వద్ద పసుపు కొమ్ములు దంచుట, తలంబ్రాలు కలుపుట తదితర పనులు చేపడతారు. దీంతో స్వామివారిని పెండ్లి కుమారునిగా చేసినట్లు భక్తులు భావిస్తారు.

## రేపు సామూహిక శ్రీలక్ష్మీ పూజలు

భద్రాచలం, మార్చి 23 : ఫాల్గునోత్తర పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీలక్ష్మి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4.30 గంటలకు సామూహిక శ్రీలక్ష్మీ పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం సంస్కృత పాఠశాల అధ్యాపకులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు, దేవస్థానం ఈవో రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.600 రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు శ్రీస్వర్ణలక్ష్మి అమ్మవారి అభిషేకంలో పాల్గొనే భక్తులు రూ.100 చెల్లించాల్సి ఉంటుందని, ఫాల్గునోత్తర శాశ్వత పూజకు రూ.6 వేలు, శ్రీస్వర్ణలక్ష్మి అమ్మవారి శాశ్వత అభిషేకానికి రూ.వెయ్యి చొప్పున చెల్లించినట్లయితే పదేళ్లపాటు వారి గోత్రనామాలతో అర్చనతోపాటు వారు స్వయంగా వేడుకల్లో పాల్గొనవచ్చని వారు పేర్కొన్నారు.

## జమలాపురం ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, మార్చి 23 : జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తెల్లవారుజామునే మంగళ వాయిద్యాల నడుమ ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టువస్త్రాలు ధరింపజేసి ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనం కల్పించారు. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో పాలపొంగళ్లు తయారు చేసి స్వామివారికి నివేదించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ పర్యవేక్షకులు బీ.శ్రీనివాస్, ముఖ్య అర్చకులు విజయదేవ శర్మ, సుదర్శన శాస్త్రి, సీనియర్ అసిస్టెంట్ కే.విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు

### కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



తోగ్గూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ రూరల్, మార్చి 23 : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించానని, త్వరలోనే అమలు చేసి ప్రజల సమస్యలు తీరుస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తోగ్గూడెంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాల్వంచ మండల సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తోగ్గూడెంలో ముర్రేడు వాగుపై చెక్‌డ్యాం నిర్మించి రైతుల సాగు భూములకు ఇబ్బంది లేకుండా చూస్తానన్నారు. కాగా.. పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరావు, సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగరపు శ్రీనివాసరావు, వెంకన్న , గిరి, జర్పుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించండి

### అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

వైరాటౌన్, మార్చి 23 : సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వైరా మండల కేంద్రంలో సెక్టార్ అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే నెలలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని, వాటిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయో.. లేదో పరిశీలించాలన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా ఉండాలన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన రూట్ మ్యాప్‌లను పరిశీలించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఐదు మండలాల సెక్టార్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా పరీక్షల నిర్వహణ : డీఈవో

కూసుమంచి, మార్చి 23 : పదో తరగతి పరీక్షల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని, ఎటువంటి లోటుపాట్లు జరగకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని డీఈవో సోమశేఖర శర్మ అన్నారు. కూసుమంచి, నాయకన్‌గూడెం పాఠశాలల్లోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను డీఈవో శనివారం తనిఖీ చేశారు. పరీక్ష తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్ కాపీయింగ్ జరిగితే ఇన్విజిలేటర్లు, పరీక్ష నిర్వహణ బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చూడాలన్నారు.

# రంగుల కేళీ.. హోలీ



*హోలీ.. రంగుల కేళి. మనస్సు నిండా ఆనందాన్ని నింపే సంబురం. చిన్నాపెద్ద, పేదాధనిక తేడాలేకుండా స్నేహభావంతో రంగులు చల్లుకునే కలర్‌ఫుల్ వేడుక. మనుషులంతా ఒక్కటే అనే సందేశమిచ్చే పండుగ. రంగులను ప్రేమగా ఒకరికొకరు ముఖాలకు పులుముకుంటూ వీధుల్లో చేసే సందడి అంతాఇంతా కాదు. అయితే ఈసారి కొంతమంది ఆదివారం, మరికొందరు సోమవారం హోలీ జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రసాయన రంగులు వద్దని, సహజరంగులే ఆరోగ్యానికి మేలని ఎప్పటిలాగే వైద్యులు సూచిస్తున్నారు.*

## కలర్‌ఫుల్ వేడుకకు ప్రజలు సిద్ధం

## నేడూ, రేపు హోలీ పౌర్ణమి సంబురాలు

## సహజ రంగులే ఆరోగ్యానికి మేలు





హోలీ సంబురాల్లో పాల్గొన్న యువకులు (ఫైల్)

కొత్తగూడెం టౌన్/ సారపాక, మార్చి 23 : హోలీ సంబురాలను జరుపుకునేందుకు ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని కాముడిదహనం, రంగులు చల్లుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. హోలీ హోలీల రంగ హోలీ.. చమ్మకేళిల హోలీ అంటూ పాటలు పాడుకుంటూ చిన్నాపెద్దా కలిసి వేడుకల్లో పాల్గొననున్నారు. క్యాలెండర్‌లో ఆది, సోమవారాలు హోలీ వేడుకలు ఉండడంతో కొంతమంది ఆదివారం, మరికొంతమంది సోమవారం వేడుకలు జరుపుకోనున్నారు. కాముడిదహనం చేయనున్నారు. సింగరేణి ఏరియాలో ప్రభుత్వ సెలవు సోమవారం కావడంతో హోలీ సంబురాలు జరగనున్నాయి. యువత రంగులను కొనుగోలు చేసే పనిలోపడ్డారు. కాలనీల్లో ఒకచోట అందరూ చేరి హోలీ రంగులు పూసుకుంటూ డీజే పాటలకు స్టెప్పులేయాలని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమ స్నేహితులతో ఒక్క రోజు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు రెడీ అయ్యారు.

### హోలీ పురాణమిదే..

హోలీ పుట్టుకను తెలిపే పురాణ గాథలు ఎన్నో ప్రచారంలో ఉన్నాయి. హోలిక అనే రాక్షసి తాను నివసించే పరిసర ప్రాంతాల్లో ఉండే పిల్లలను ఎత్తుకువెళ్లి తినేస్తుంటుంది. దీంతో ఆ ప్రాంతవాసులు హోలికను కాల్చి చంపుతారు. ఆనాటి నుంచి హోలిక పేరు మీద హోలీని జరుపుకోవడం ఆనవాయితీ.

### కామదహనం

హోలీకి ముందు అర్ధరాత్రి 'కామదహనం' అనాదిగా వస్తున్న ఆచారం. శరీరంలో రోగాలన్నీ మటుమాయమై అందరికీ ఆయురారోగ్యాలు చేకూరాలని ఆశిస్తూ ఇంట్లోని పాత వస్తువులు, కలపను, పేడతో చేసిన పిడకలను కూడళ్ల వద్దకు చేర్చి కామదహనం చేస్తారు. మిగిలిన బూడిదను దిష్టి తగలకుండా బొట్టుగా పెట్టుకుంటారు.

### మోదుగు పూలరంగు

ప్రాచీనకాలంలో రంగుల కోసం మోదుగుపూలు వాడేవారు. ఇవి చర్మానికి ఎంతో శోభ తెచ్చేవి. మోదుగు పూలతో రంగులు తయారు చేసుకుని హోలీకేళిని జరుపుకునేవారు. మోదుగు పూలు ఈ కాలంలో వచ్చే రోగాలకు కూడా దివ్యమైన ఔషధం.

# ఇద్దరికిద్దరు!

- విద్యార్థులు లేక పాఠశాల వెలవెల
- పట్టించుకోని ఐటీడీఏ విద్యాశాఖ



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు శోభన్‌బాబు

చంద్రుగొండ, మార్చి 23 : 'ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేస్తాం. బడి బయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తాం. మూతపడిన పాఠశాలలను తెరిపిస్తాం. మౌలిక సౌకర్యాలు కల్పించడంతోపాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేస్తాం'.. అని కాంగ్రెస్ ప్రభుత్వం పదే పదే చెప్పడం బాగానే ఉన్నా.. ఇక్కడ మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఇక్కడ మాత్రం విద్యార్థులు లేక పాఠశాల వెలవెలబోతోంది. ఉన్న ఇద్దరు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధించడం విద్యాశాఖ అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. చంద్రుగొండ మండలం సామ్యతండాలోని గిరిజన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు ఒకటో తరగతి చదువుతున్నారు. వీరికి పాఠాలు బోధించడానికి ఒక ఉపాధ్యాయుడు పాపారావు(ఎస్జీటీ)విధులు నిర్వర్తిస్తుండగా.. మరో ఉపాధ్యాయుడు అన్నపురెడ్డిపల్లి మండలం నామారం పాఠశాల నుంచి బోడా శోభన్ బాబు డిప్యూటేషన్‌పై వచ్చి ఇద్దరు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నాడు. శనివారం ఇద్దరు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడిని 'నమస్తే' వివరాలు అడగ్గా.. వచ్చే ఏడాది నుంచి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామన్నారు.

### పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ఇద్దరు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్నా కనీసం విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో పదుల సంఖ్యలో ఉన్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. బడి ఒక రోజు తెరిస్తే మూడు రోజుల వరకు తెరవరని, పాఠాలు చెప్పని పాఠశాలకు పిల్లలను ఎలా పంపించాలని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇద్దరు పిల్లల కోసం ఇద్దరు ఉపాధ్యాయులు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఐటీడీఏ ఏటీడబ్ల్యూవో చంద్రమోహన్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఫోన్ ఎత్తి వెంటనే స్విచ్ఛాఫ్ చేశారు. ఎంఈవో సత్యనారాయణను వివరణ కోరగా.. జీపీఎస్‌కు, మాకు సంబంధం లేదని, అవి ఐటీడీఏ పరిధిలోకి వస్తాయని వివరించారు.

## టేకులపల్లి కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు



బలరాంనాయక్ సమక్షంలో ఘర్షణ పడుతున్న కాంగ్రెస్ నాయకులు

టేకులపల్లి, మార్చి 23 : మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ సమక్షంలో టేకులపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఘర్షణపడ్డారు. మండలం కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా దేవానాయక్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. వివరాల్లోకెళ్తే.. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎంపీ అభ్యర్థి వెంట భూక్యా ధళ్‌సింగ్‌నాయక్ హాజరయ్యారు. బలరాంనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎన్నికల్లో గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని కోరారు. అనంతరం ధళ్‌సింగ్‌నాయక్ మాట్లాడుతున్న సమయంలో కొందరు నాయకులు లేచివెళ్లిపోతున్నారు. దీంతో ఎందుకు వెళ్తున్నారు అని ధళ్‌సింగ్‌నాయక్ అడగడంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోరం కనకయ్యకు వ్యతిరేకంగా పనిచేసి, ఇప్పుడేమో పార్టీ గురించి మాట్లాడుతున్నావా అని ఒక వర్గం నాయకులు ఘర్షణకు దిగారు. దీంతో వెంటనే బలరాంనాయక్ చిన్నగా అక్కడ నుంచి జారుకున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి ద్రోహంచేసిన నాయకులను ఎంపీ అభ్యర్థి వెంట తిరుగుతున్నారని ఒక వర్గం నాయకులు మండిపడుతున్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఇస్లావత్ రెడ్యానాయక్, నర్సింగ్ లక్ష్మయ్య, పోశాలు, మధురెడ్డి, మంగీలాల్, సంజయ్, నర్సయ్య, సర్దార్ నాయక్, రవి, భద్రు పాల్గొన్నారు.

## బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి

- చెక్‌పోస్టు సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి
- సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి
- నేర సమీక్షలో భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు, సమావేశంలో పాల్గొన్న అధికారులు

కొత్తగూడెం క్రైం, మార్చి 23 : పార్లమెంట్ ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పోలీస్ అధికారులతో శనివారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక వ్యక్తుల, రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్‌లు, మట్కా నిర్వహించే వారిపై నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తూ.. చెక్‌పోస్టులలో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. సరైనా ఆధారాలు లేకుండా పరిమితికి మించి నగదును తీసుకెళ్తూ పట్టుబడితే ఎన్నికల నియమావళి ప్రకారం కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడేలా చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిత్యం రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా హాట్ స్పాట్స్‌ను గుర్తించి గంజాయి రవాణా చేసే వ్యక్తులతోపాటు సేవించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఎప్పటిప్పుడు అవగాహన కార్యక్రమాలు, ప్రచారాలు విస్తృతంగా నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉంచాలన్నారు. ప్రతి ఠాణా పరిధిలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని (బ్లాక్ స్పాట్స్) గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్, కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీశ్‌కుమార్, ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను, మణుగూరు డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

### ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్



సిబ్బందితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

సారపాక, మార్చి 23 : పారిశ్రామిక ప్రాంతమైన సారపాక పంచాయతీ పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐటీడీఏ పీవో, పంచాయతీ ప్రత్యేకాధికారి ప్రతీక్ జైన్ ఆదేశించారు. శనివారం సారపాకలో పంచాయతీ కార్యాలయం, డంపింగ్ యార్డు, పల్లెప్రకృతి వనం, నర్సరీ, వైకుంఠధామాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డుల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుల్లో వేసేలా చూడాలన్నారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి సారపాక మీదుగా వేలాదిగా భక్తులు వస్తుంటారని, ఈ నేపథ్యంలో పంచాయతీ పరిధిలో ఎక్కడ కూడా చెత్తాచెదారం కనిపించొద్దన్నారు. ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డు సరిపోకపోతే కొత్తగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈవోను ఆదేశించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పల్లెప్రకృతి వనం, నర్సరీ, వైకుంఠధామాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వార్డుల్లో డ్రైనేజీలను శుభ్రం చేయాలని, దోమలు వ్యాప్తిచెందకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా నర్సరీ, పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవో కంది మహేశ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల విధులపై అవగాహన అవసరం

### అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మామిళ్లగూడెం, మార్చి 23 : ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధి విధానాలపై అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులందరూ కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. సీ-విజిల్ యాప్ గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సంఘటనలు జరిగినా వాటి ఫొటోలు, వీడియోలతో సహా సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.రాజేశ్వరి, మాస్టర్ ట్రైనీ కొండపల్లి శ్రీరామ్, అసిస్టెంట్ మాస్టర్ ట్రైనీ మదన్‌గోపాల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధాని తీరుతో ప్రజాస్వామ్యం ఖూనీ

- ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే విపక్ష నేతల అక్రమ అరెస్టులు
- కేజ్రీవాల్ అరెస్టు నిరసన కార్యక్రమంలో వామపక్ష నేతలు



కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

ఖమ్మం కమాన్‌బజార్, మార్చి 23: ప్రజాస్వామ్యాన్ని ప్రధాని మోదీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందని వామపక్ష నేతలు విమర్శించారు. ప్రశ్నించే వారిని, విపక్ష నేతలను ప్రధాని మోదీ లక్ష్యంగా ఎంచుకుని పనిచేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఖమ్మంలో శనివారం ఆం దోళన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి వచ్చేందుకే విపక్షాలపై మోదీ దాడి చేస్తున్నారని అన్నారు. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థల ద్వారా అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అవినీతి లేదా అని ప్రశ్నించారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ప్రసాద్ తెలిపారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను రాజకీయ సంస్థలుగా మార్చి బీజేపీ అనుకూల చర్యలు తీసుకునేలా మోదీ ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. స్వాతంత్ర భారతదేశ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో ఏ విపక్ష నాయకుడినీ బీజేపీ ప్రభుత్వం బయట తిరగనివ్వబోదని అన్నా రు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులు పోటు ప్రసాద్, ఎర్రా శ్రీకాంత్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, బాగం హేమంతరావు, పోటు కళావతి, సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, దొండపాటి రమేశ్, పగడాల మల్లేశ్, తాటి నిర్మల, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, శ్రావణ్, లక్ష్మణ్, రమేశ్, మీరా, ఆవుల వెంకటేశ్వర్లు, రామయ్య, మలీదు నాగేశ్వరరావు, సీపై పుల్లయ్య, శిరోమణి పాల్గొన్నారు.